అందరి భాగస్వామ్యంతోనే విజయం


సమావేశంలో మాట్లాడుతున్న చుండూరి రవిబాబు


పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

● వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ విజయానికి అందరి భాగస్వామ్యం అత్యంత కీలకమని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు అన్నారు. ఒంగోలు నగరంలోని 45వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చుండూరి రవిబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులలో నిబద్ధత, క్రమశిక్షణ, సేవాభావం ఉంటే ప్రజల్లో విశ్వాసం చేకూరుతుందని అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు ధైర్యం నూరిపోస్తూ భవిష్యత్ కార్యాచరణకు స్పష్టమైన మార్గదర్శకతను రవిబాబు అందించారు. కార్యక్రమంలో పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, ప్రవీణ్‌కుమార్, వెన్నపూస కుమారి, 45వ డివిజన్ అధ్యక్షుడు పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు పాలడుగు రాజీవ్, వెంకటేశ్వరరెడ్డి, వెన్నపూస వెంకటేశ్వరరెడ్డి, రవీంద్రరెడ్డి, దుంపా చెంచిరెడ్డి, భూమిరెడ్డి రమణమ్మ, బుజ్జి, చిన్నా, పేరం ప్రసన్న, మేరీ, వాణి, ఫాతిమా, నరాల రమణారెడ్డి, మాలకొండారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రామకృష్ణారెడ్డి, గురవారెడ్డి, శ్రీనివాసరెడ్డి, గోవిందరెడ్డి, కరిముల్లా, నరసింహగౌడ్, హనుమారెడ్డి, మోహనరెడ్డి, సుబ్బారెడ్డి, శివారెడ్డి, విక్రమ్, నాని, వాసు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూతుల్లో సౌకర్యాలు పక్కాగా ఉండాలి


రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామి రెడ్డి, ఎదురుగా వైఎస్సార్‌సీపీ ప్రతినిధి దామరాజు

● స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామి రెడ్డి

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలు పక్కాగా ఉండాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.వెంకట శివరామి రెడ్డి సూచించారు. ఒంగోలు కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ ఛాంబర్‌లో సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో నెలవారీ పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో వెంకట శివరామి రెడ్డి మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో ఎన్నికల అధికారులు ప్రతి పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించి అన్ని వసతులు ఉన్నదీ, లేనిదీ గమనించి పక్కాగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ఓటుకు ఆధార్ అనుసంధానం చేసుకోని వారు ఆధార్ అనుసంధానం చేసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఒంగోలు నగరంతో పాటు జిల్లాలోని పట్టణాల్లో ఇళ్లకు డోర్ నంబర్లు లేకుంటే అధికారులు శ్రద్ధ తీసుకొని వేయించాలని వైఎస్సార్‌సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్ కోరారు. పొలిటికల్ పార్టీల సభ్యులు గత సమావేశంలో అడిగిన ప్రశ్నలకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సమాధానం చెప్పారు. చనిపోయిన వారి ఓట్లు తెలియజేయాలని, అందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఒంగోలు ఆర్‌డీఓ కే.లక్ష్మీ ప్రసన్న, కనిగిరి ఆర్‌డీఓ ఎస్.కేశవర్ధనరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎస్.జాన్సన్, ఏ.కుమార్, ఎస్.వరకుమార్, సత్యనారాయణ, ఓ రవీంద్రారెడ్డి, జిల్లా ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి, ఒంగోలు అర్బన్ తహశీల్దార్, పిన్నిక మధుసూదనరావు, పొలిటికల్ పార్టీల ప్రతినిధులు, జిల్లా ఎలక్షన్ డీటీ. రాజశేఖర్ రెడ్డి, ఒంగోలు డీటీ.సలోమి, ఉపేంద్ర పాల్గొన్నారు.

క్లుప్తంగా

సజ్జలను కలిసిన మైనార్టీ సెల్ నాయకుడు


సజ్జల రామకృష్ణారెడ్డితో కాలేషా

సంతనూతలపాడు: వైఎస్సార్ సీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని ఆ పార్టీ మైనార్టీ సెల్ నాయకుడు గొడుగు కాలేషా సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో కలిశారు. పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర స్థాయి సమావేశంలో పాల్గొన్న అనంతరం సజ్జలను కలిసి బొకే అందజేశారు.

ప్రతిఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలి

సంతనూతలపాడు: ప్రతిఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని కెనరా బ్యాంకు లీడ్ మేనేజర్ డి.రమేష్ కోరారు. సంతనూతలపాడు మండలం మైనంపాడు ఎస్టీకాలనీలో చీమకుర్తి ఆర్థిక అక్షరాస్యత ఆధ్వర్యంలో కెనరా బ్యాంక్ పర్యవేక్షణలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రమేష్ పాల్గొని ప్రసంగిస్తూ ప్రతిఒక్కరూ బ్యాంకులో అకౌంట్ కలిగి ఉండాలన్నారు. స్థానికులచే నూతన అకౌంట్లు ఓపెన్ చేయించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఎఫ్ఎల్ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాసు, చీమకుర్తి కౌన్సిలర్లు ఏ చిన్నరాజా, ఎస్.అమృతరాజు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గామల్లేశ్వరస్వామికి అన్నాభిషేకం


ప్రత్యేక అలంకరణలో దుర్గామల్లేశ్వరస్వామి

ఒంగోలు మెట్రో: స్థానిక నెహ్రూకాలనీలోని శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు పాలాభిషేకం, పంచామృతాభిషేకం అనంతరం అన్నాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మూలవిరాట్‌ను చక్కగా అలంకరించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులను భర్తీ చేయాలి


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

ఒంగోలు సిటీ: గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే ఎర్రయ్య, జి.నరసింహారెడ్డి కోరారు. ఆ మేరకు సోమవారం డీఈఓ కిరణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు 15, పీఎస్ హెడ్మాస్టర్లు 20, స్కూల్ అసిస్టెంట్లు 15 ఖాళీలను వెంటనే పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు.

దొంగచాటుగా స్మార్ట్ మీటర్ల బిగింపు

● అడ్డుకోవాలని సీపీఎం నాయకుల పిలుపు
● విద్యుత్ భవనం వద్ద ధర్నా


ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఒంగోలు టౌన్: స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ఇంటి యజమాని అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉండగా, అందుకు వ్యతిరేకంగా ఇంటి యజమాని ఇంట్లో లేని సమయంలో దొంగచాటుగా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు జి.రమేష్ ఆరోపించారు. స్మార్ట్ మీటర్ల బిగింపును ప్రజలంతా మూకుమ్మడిగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. విద్యుత్ స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక రాంనగర్ విద్యుత్ భవనం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎలాంటి ప్రజామోదం లేకుండానే, ప్రజలు ఎలాంటి దరఖాస్తులు చేయకుండానే స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని విమర్శించారు. 2023 విద్యుత్ చట్టాలకు అనుగుణంగా రాష్ట్రాలు కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు రద్దు కుదరదంటూ బుకాయించడం ప్రజలను వంచించడమేనని చెప్పారు. పాత మీటర్ల వలన ప్రజలకు ఎలాంటి సమస్యలూ లేనప్పుడు కొత్తగా స్మార్ట్‌మీటర్లు ఎందుకు బిగిస్తున్నారని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో తాము విద్యుత్ చార్జీలు పెంచము అని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మాట తప్పి ప్రజలపై రూ.15 వేల కోట్ల సర్ చార్జీల భారం వేసిందని మండిపడ్డారు. మీటర్ల ఏర్పాటుకు డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదని చెబుతున్నారని, 93 నెలల కాల పరిమితితో సింగిల్ ఫేజ్‌కు రూ.8,927, త్రీ ఫేజ్‌కు రూ.17,286 వసూలు చేయనున్నారని తెలిపారు. ఇప్పటి వరకు కరెంటు బిల్లు వచ్చిన తర్వాత 15 రోజుల వరకు బిల్లు చెల్లించే వెసులుబాటు ఉండగా, ఇప్పుడు రీచార్జి అయిపోగానే దానికదే కరెంటు కట్ అవుతుందని వివరించారు. స్మార్ట్ మీటర్లను అడ్డుకోకపోతే వినియోగదారులకు ఉరితాడుగా మారే అవకాశం ఉందన్నారు. ధర్నాలో జి.ఆదిలక్ష్మి, మారెళ్ల సుబ్బారావు, బీవీ రావు, ఆర్.శ్రీనివాసరావు, రామకృష్ణ, పేరయ్య, శేషయ్య, తంబి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

చీమకుర్తి: స్థానిక యానాదికాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చీమకుర్తి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నోట్‌బుక్స్, పెన్నులు, ఇతర విద్యాసామగ్రి పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కడవా రామకృష్ణ, కే సుధాకర్, పాఠశాల ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.


విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

రంగసాయిపురం పాఠశాలలో...


రంగసాయిపురంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓలు

చీమకుర్తి రూరల్: మండలంలోని గాడిపర్తివారిపాలెం సచివాలయం పరిధిలో గల రంగసాయిపురం మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు హెడ్‌మాస్టర్ పల్లె స్వర్ణ, ఎస్ఎంసీ చైర్మన్ అనూష ఆధ్వర్యంలో సోమవారం పుస్తకాలు, నోట్‌బుక్స్, పలు విద్యా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు శివాజీ, నరసింహారావు, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నగలు తయారు చేసిస్తానని డబ్బు వసూలు

● మోసపోయామంటూ పోలీస్ గ్రీవెన్స్‌లో ఎస్పీకి బాధితుల ఫిర్యాదు


ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: బంగారు నగలు తయారు చేసిస్తానని చెప్పి ఒక వ్యక్తి డబ్బు తీసుకుని మోసం చేశాడని సంతనూతలపాడు గ్రామానికి చెందిన ఒక మహిళ సోమవారం ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేసింది. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ఎస్పీని కలిసి అర్జీ అందజేసింది. బంగారు నగలు చేసిస్తానని చెప్పి తన వద్ద నుంచి విడతల వారీగా రూ.1.77 లక్షలు వసూలు చేశాడని, ఆభరణం తయారు చేసివ్వకుండా మోసం చేశాడని ఫిర్యాదులో పేర్కొంది. అలాగే గవర్నమెంటు నుంచి రుణం ఇప్పిస్తానని చెప్పి నగరంలోని మామిడిపాలేనికి చెందిన ఒక వ్యక్తి 3 లక్షలు తీసుకుని మోసం చేశాడంటూ అదే వీధికి చెందిన వ్యక్తి ఫిర్యాదు చేశారు. తన వద్ద నుంచి తీసుకున్న డబ్బు తిరిగివ్వాలని అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నాడని చెప్పారు. పోలీసుశాఖ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొత్తం 83 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు ఎస్పీని కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదులు అందజేశారు. ఆయా సమస్యలపై స్పందించిన ఎస్పీ.. సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, డీటీసీ సీఐ షమీవుల్లా, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సై జనార్దన్ రావు పాల్గొన్నారు.

ఇండో సోలార్‌కు భూములివ్వడం దారుణం

ఒంగోలు టౌన్: ఇండో సోలార్ పీవీ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీకి ఉలవపాడు మామిడి తోటలను ఇవ్వడం దారుణమని సీపీఐ (ఎంఎల్) రెడ్‌స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. పొట్టిశ్రీరాములు జిల్లాలోని కరేడు గ్రామానికి చెందిన 1000 ఎకరాల ఉలవపాడు తోటలతో సహా తరతరాలుగా రైతులు సాగు చేసుకుంటున్న 8348 ఎకరాల పంట పొలాలను చంద్రబాబు ప్రభుత్వం ఇండో సోలార్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీకి కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కరేడు భూముల సేకరణకు ఎన్డీఏ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడమే కాకుండా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతుల మీద పోలీసులు జులుం ప్రదర్శించడం సమర్థనీయం కాదన్నారు. పంటలు పండే భూములు సేకరించడాన్ని రైతులు, ప్రజలు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. అక్రమంగా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని కోరారు.

పోలీసు సిబ్బంది సేవలు మరిచిపోలేము

ఒంగోలు టౌన్: సుదీర్ఘకాలం పోలీసు శాఖకు అమూల్యమైన సేవలందించి నేడు ఉద్యోగ విరమణ చేస్తున్న వారి సేవలను ఎప్పటికీ మరిచిపోలేమని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. సోమవారం ఉద్యోగ విరమణ చేసిన కమ్యూనికేషన్ ఇన్‌స్పెక్టర్ జి.అంకయ్య, డీసీఆర్బీ ఎస్సైలు ఉన్నం సుబ్బారావు, షేక్ అమీర్, వన్‌టౌన్ ఏఎస్ఐ పి.లక్ష్మణరావు, డీసీఆర్బీ ఏఎస్ఐ సయ్యద్ రఫీ, ఏఆర్ ఎస్సై సీహెచ్ బ్రహ్మానందంను స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. పోలీసు శాఖలో 33 నుంచి 41 ఏళ్లపాటు సేవలందించడం అభినందనీయమని ఎస్పీ అన్నారు. ఇక నుంచి కుటుంబ సభ్యులతో ప్రేమ, అప్యాయతలతో గడపాలని సూచించారు. సకాలంలో రిటైర్డ్‌మెంట్ ప్రయోజనాలు అందేలా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ రాఘవేంద్ర, డీసీఆర్బీ సీఐ దేవప్రభాకర్, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఆర్ఐ సీతారామిరెడ్డి, ఏఆర్ ఎస్సై తిరుపతిస్వామి, డీసీఆర్బీ సీఐ దేవప్రభాకర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన వారికి వీడ్కోలు


కృష్ణారావు దంపతులను సత్కరిస్తున్న మాజీ మంత్రి శిద్దా, ఎమ్మెల్యే విజయకుమార్, తదితరులు


వీఆర్వో రామసుబ్బమ్మను సత్కరిస్తున్న తహసీల్దార్ నారాయణరెడ్డి, తదితరులు

సంతనూతలపాడు: మండలంలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఇద్దరికి సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. రిటైరైన ఎన్ఎస్పీ లస్కర్ జలదంకి వెంకట కృష్ణారావు, పద్మావతి దంపతులను సంతనూతలపాడులోని ఎన్ఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో సన్మానించారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ అతిథులుగా హాజరవగా, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఒంగోలు టౌన్ ప్రెసిడెంట్ కే రామ్మోహన్‌రావు అధ్యక్షత వహించారు. 37 సంవత్సరాల పాటు ఎన్ఎస్పీలో కృష్ణారావు విశిష్ట సేవలు అందించారని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్పీ డిప్యూటీ ఎస్ఈ ఎం.రామకృష్ణ, సంతనూతలపాడు ఎన్ఎస్పీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఐ.పద్మావతి, జిల్లా ఇరిగేషన్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎస్.కె కరిముల్లా బాషా, రమణారెడ్డి, దేవేంద్ర, అరుణ, ఎన్ఎస్పీ డీసీ సంఘాల అధ్యక్షుడు రామా శ్రీనివాసరావు, కంణాల వేణు, ఉపాధ్యక్షుడు చెరుకూరి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వీఆర్వోకు వీడ్కోలు...

సంతనూతలపాడు మండలంలోని గుమ్మలంపాడు వీఆర్వో రామకూరు వెంకటసుబ్బమ్మ సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఆమెకు మండలంలోని అంకాలమ్మ తల్లి దేవస్థాన ప్రాంగణంలో ఉన్న కళ్యాణ మండపంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించి సన్మానించారు. తహసీల్దార్ ఎస్.ఎల్.నారాయణరెడ్డి, మండలంలోని వీఆర్వోలు, రెవెన్యూ ఉద్యోగులు, నాయకులు పాల్గొని ఘనంగా సత్కరించారు. సంతనూతలపాడు మండల వీఆర్వోల సంఘ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు అధ్యక్షత వహించగా, డిప్యూటీ తహసీల్దార్ ఎండీ రఫీ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామ్ తేజ్, జిల్లా వీఆర్వోల సంఘ ప్రధాన కార్యదర్శి ఏసీ ఆదిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే రవికుమార్, పలువురు ఉద్యోగులు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీగిరిలో ఆరాధనోత్సవాలు

ఒంగోలు మెట్రో: శ్రీగిరి క్షేత్ర పాలకుడు అభయాంజనేయస్వామి ఆగమన ఆరాధనోత్సవాలను ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఒంగోలు కుర్తాళం శ్రీ సిద్దేశ్వరీ పీఠపాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి తెలిపారు. బుధవారం ఉదయం ఏడు గంటలకు అభయాంజనేయస్వామికి అభిషేకం, భక్తులచే 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ జరుగుతాయన్నారు. సాయంత్రం అభయాంజనేయస్వామికి అర్చన, అనంతరం శ్రీవారికి ఊంజల్ సేవ, శ్రీ గిరి దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసుడు వీవీఎస్ వినోద్ కుమార్‌చే గాత్రకచేరీ జరుగుతాయన్నారు. గురువారం ఉదయం తొమ్మిది గంటలకు హనుమత్ యాగం, పూర్ణాహుతి, శుక్రవారం ఉదయం ఆరు గంటలకు శ్రీవారికి శుక్రవార అభిషేకం నిర్వహిస్తారని తెలిపారు. ఏడు గంటలకు మునుకుట్ల సుబ్రహ్మణ్యశాస్త్రిచే సుందరాకాండ పారాయణ జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ నాయకుడికి నివాళులు


అచ్చయ్యకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చీమకుర్తి రూరల్: మండలంలోని పడమటి నాయుడుపాలెం గ్రామంలో ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు తొరటి అచ్చయ్య ఇటీవల మృతి చెందగా సోమవారం ఆదరణ స్తుతి కూడిక నిర్వహించారు. అతని చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ నాయకుడు ఉసురుపాటి బ్రహ్మయ్య పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో అత్యాల గంగయ్య, తొరటి రోశయ్య, ఆనంద్, సాల్మన్, పాటిబండ్ల గంగయ్య, రత్నం, జడ మరియదాసు, బాబు, కృపయ్య, తదితరులు పాల్గొన్నారు.

మండల వ్యవసాయాధికారికి సన్మానం


కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాఖాధికారులు

మద్దిపాడు: మండలంలో గత ఆరేళ్లుగా వ్యవసాయశాఖ అధికారిగా పనిచేసిన కె.రమేష్‌బాబు బదిలీపై ఒంగోలు వెళుతున్న సందర్భంగా వీఏఏలు, డీలర్లు, పలువురు రైతులు సోమవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు, ఏడీఏ రమేష్‌బాబు, మండల ఏఓ స్వర్ణలత, పలువురు ఏఓలు, రైతులు, వీఏఏలు, డీలర్లు పాల్గొన్నారు.